గడువులోగా
ఎల్ఆర్ఎస్ గగనమే!

- మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- పరిశీలనకు నోచుకోని లక్షలాది దరఖాస్తులు
- సర్కారు ఒత్తిడిపై ఉద్యోగ సంఘాల ఆగ్రహం
- కసరత్తు లేకుండా గడువు ఏంటని మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రకటించిన లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్-ఎల్ఆర్ఎస్ ఆర్భాటపు ప్రకటన అని, ఆచరణ అసాధ్యమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు ఎలాంటి ముందస్తు కసరత్తు లేకుండా హడావుడిగా ప్రకటన చేశారమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన దరఖాస్తులు, పరిష్కరించేందుకు కావాల్సిన సిబ్బంది మధ్య పొంతన లేకపోవడమే ఇందుకు కారణమని ఉద్యోగ సంఘాల నేతలు చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ కోసం 25.60 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఫీజులు చెల్లించి పరిష్కారానికి నోచుకున్నవి 3 లక్షలకు మించలేదు. ఇంకా 22 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని మార్చి 31 లోగా పరిష్కరించాలని ప్రభుత్వం అధికారులకు గడువు విధించింది. దరఖాస్తుదారులు గడువులోగా పరిష్కరించుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తామని వెల్లడించింది. కానీ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నది. లక్షలాది దరఖాస్తులను పరిష్కరించేందుకు ఎంత సమయం పడుతుంది? ఎంత సిబ్బంది అవసరం? అనే విషయాలను పట్టించుకోకుండా ఆగమేఘాలపై ప్రకటన ఎలా చేస్తారని ఉద్యోగ సంఘంలో ఓ కీలక నాయకుడు ప్రశ్నించారు.

దరఖాస్తుల కుప్పలు.. అధికారుల తిప్పలు

రాష్ట్రంలోని ఎల్ఆర్ఎస్ కోసం దాఖలైన దరఖాస్తుల్లో కేవలం 10 శాతం కూడా అధికారులు పరిష్కరించలేదు. కొన్ని మున్సిపాలిటీలలో ఒక్కటంటే ఒక్కటి కూడా పరిష్కారం కాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వరంగల్, నల్లగొండ, ఖమ్మం, పెద్దఅంబర్‌పేట్, తుర్కయాంజల్, బడంగ్‌పేట్‌లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది పరిస్థితి. మరోవైపు రోజూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతున్నదని మున్సిపల్ అధికారులు వాపోతున్నారు. సిబ్బంది లేకుండా తాము మాత్రం ఏం చేయగలమని నిలదీస్తున్నారు. ప్రభుత్వం తమకు ఎన్ని డెడ్‌లైన్లు విధించినా, ప్రజలకు ఎన్ని రాయితీ ఆఫర్లు ప్రకటించినా సిబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించలేమని తేల్చిచెప్తున్నారు.

ఉచిత ఎల్ఆర్ఎస్ ఉత్తముచ్చటేనా!

శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఇచ్చింది. కానీ ఇప్పుడు 25 శాతం రాయితీ అంటూ మాట మార్చిందని రాజకీయవర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ హామీని నమ్మి ఓటేసిన ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండి చేయి చూపించిందని పలువురు నేతలు మండిపడుతున్నారు. ఉచిత ఎల్ఆర్ఎస్ హామీ ఉత్తముచ్చటైందని ఎద్దేవా చేస్తున్నారు. కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేకుండా స్థానిక ఎన్నికల్లో లబ్ధికోసమే హడావుడి చేస్తున్నదని ఆరోపిస్తున్నారు.

ఇద్దరు ఐపీఎస్‌ల రిలీవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఏపీ క్యాడర్ ఐపీఎస్ అధికారులను కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. రోడ్ సేఫ్టీ డీజీగా పనిచేస్తున్న అంజనీకుమార్, రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డీజీ అభిలాష బిస్తును రిలీవ్ చేస్తూ సీఎస్ శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఏపీ ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలని వారిని ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి రిలీవింగ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఈసీ నిర్ణయంపై ఆయన రిలీవింగ్ ఆధారపడి ఉంటుంది. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి కేటాయించిన కొందరు అధికారులు క్యాట్ ఉత్తర్వుల మేరకు తెలంగాణాలోనే పనిచేస్తున్నారు.

హైవేల నిర్వహణకు బడ్జెట్ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): జాతీయ రహదారుల నిర్వహణ కోసం రూ. 23.18 కోట్లు, వరదకు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్లు, భవనాల మరమ్మతులకు 18.26 కోట్లు విడుదల చేశారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ , ఎన్‌హెచ్ హైదరాబాద్‌కు మూడో త్రైమాసికానికి బడ్జెట్ విడుదల చేస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ఉత్తర్వు జారీచేశారు.

పీఎం సెక్రటరీగా శక్తికాంత దాస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌కు కీలక పదవివరించింది. ప్రధాని నరేంద్ర మోదీ రెండో ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ప్రస్తుతం గుజరాత్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ పీకే మిశ్రా ప్రిన్సిపల్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. తమిళనాడుకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అయిన దాస్ నియామకానికి ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ అపాయింట్‌మెంట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధానమంత్రి పదవికాలం ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్యులు వచ్చేవరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. 42 ఏండ్లుగా సివిల్ సర్వెంట్‌గా విధులు నిర్వహించిన ఆయన..25వ ఆర్బీఐ గవర్నర్‌గా విధులు నిర్వహించారు కూడా.

జియోటెలీతో థామ్సన్ క్యూలెడ్ టీవీ
ధర రూ.18,999



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్..దేశీయ మార్కెట్లోకి తొలిసారిగా జియోటెలీ ఆపరేటింగ్ సిస్టమ్‌తో నడిచే 43 అంగుళాల క్యూలెడ్ టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. రూ.18,999 ప్రారంభ ధరతో ఫ్లిప్‌కార్ట్‌లో ఈ టీవీ లభించనున్నదని పేర్కొంది. జియోటెలీ ఓఎస్ ఆధారిత టీవీలను విడుదల చేయడానికి జియోతో వ్యూవహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ థామ్సన్ క్యూలెడ్ టీవీతోపాటు జియోహాట్‌స్టార్‌ను మూడు నెలలపాటు, జియోసావన్ మూడు నెలలు, జియోగేమ్స్ నెలపాటు ఉచితంగా అందిస్తున్నది. అలాగే రూ.499 విలువైన స్విగ్గీ ఫుడ్ ఆర్డర్‌పై రూ.150 తగ్గింపు కల్పిస్తున్నది.

ఈ మార్కెట్లకు ఏమైంది..

రూ.లక్షల కోట్లలో కరిగిపోతున్న మదుపరుల సంపద

వరుస నష్టాల్లో సూచీలు.. అదానీ, అంబానీలకు భారీ షాక్‌లు

ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.2.5 లక్షల కోట్ల విలువను కోల్పోయిన బడా కార్పొరేట్ సంస్థలు

ముంబై, ఫిబ్రవరి 22: భారతీయ స్టాక్ మార్కెట్లు.. మదుపరులకు షాక్ మార్కెట్లుగా తయారవుతున్నాయి. ప్రధాన సూచీలు వరుస నష్టాల్లో కదలాడుతుండటంతో లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోతున్నది మరి. అటు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ)లోని సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)లోని నిఫ్టీ.. రెండింట్లోనూ నమోదైన కంపెనీల విలువ గతకొద్ది రోజులుగా దారుణంగా పడిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు ముఖ్య కారణాల్లోకి వెళ్తే.. పలు దేశ, విదేశీ పరిణామాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే అంతకంతకూ పడిపోతున్న రూపాయి మారకం విలువ, పెరుగుతున్న బాండ్ ఈల్డ్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతోపాటు ఇజ్రాయెల్-హమాస్ పరస్పర దాడులు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలతో ఏర్పడ్డ వాణిజ్య యుద్ధం భయాలు, నిరాశపర్చిన కేంద్ర బడ్జెట్, ఆశించిన స్థాయిలో లేని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీ రేట్ల తగ్గింపులు, పడిపోతున్న భారత జీడీపీ, విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం, పడకేసిన పారిశ్రామికోత్పత్తి వంటివి దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను పెద్ద ఎత్తున ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి మొదలు ఇప్పటిదాకా సెన్సెక్స్ 2,827.95 పాయింట్లు, నిఫ్టీ 848.90 పాయింట్లు కోల్పోయాయి.

అదానీ టాప్ లూజర్

ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ సంస్థల స్టాక్స్ విలువ భారీగా పడిపోయింది. 11.9 బిలియన్ డాలర్లు (రూ.లక్ష కోట్లపైనే) హరించుకుపోయింది. ఆ తర్వాత ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విలువ 2.94 బిలియన్ డాలర్లు (రూ.25వేల కోట్ల పైనే) క్షీణించింది. దిలీప్ సంఘ్వీ, శివ్‌నాడార్, రవీ జైపూరియా వంటి బడా కార్పొరేట్ కంపెనీల విలువ సైతం బాగానే పతనమైంది. అందరిదీ కలిపితే రూ.2.5 లక్షల కోట్లదాకా నష్టం ఉంటున్నది. మరోవైపు ఈ దెబ్బకు బ్లూంబర్గ్ బిలియనీర్ ఇండెక్స్‌లో ముకేశ్ అంబానీ స్థానం 17 (87.7 బిలియన్ డాలర్లు)కు, గౌతమ్ అదానీ ర్యాంక్ 23 (66.8 బిలియన్ డాలర్లు)కు దిగజారాయి. అయితే ఇప్పటికీ ఆసియా దేశాల్లోని సంపన్నుల్లో అగ్రస్థానంలో ముకేశ్, ఆ తర్వాత అదానీయే ఉన్నారు.

ఎఫ్ఐఐలు దూరం

విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వీలైనంత ఎక్కువగా వెనక్కి తీసుకుంటూనే ఉన్నారు. జనవరిలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.78,000 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకోవడం గమనార్హం. ఈ నెల్లోనూ రూ.40,436.17 కోట్లు తరలిపోయాయి. దీంతో ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూ.1,18,436.17 కోట్లు వెనక్కి పోయినట్టైంది. ఇక దేశీయంగా పెట్టుబడులు పెడుతున్న ఎఫ్ఐఐల్లో సుమారు 35 శాతం అమెరికాకు చెందినవారే. అగ్రరాజ్యాధినేత ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వీరి పెట్టుబడుల ఉపసంహరణలు ఇటీవలికాలంలో పెరిగాయని చెప్పవచ్చు. నిజానికి గడిచిన పదేండ్లలో భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐ పెట్టుబడుల వాటా 4 శాతానికిపైగా క్షీణించింది. 2015 జనవరిలో 20.2 శాతంగా ఉంటే.. ఈ ఏడాది జనవరిలో 16 శాతంగా ఉన్నది. ఇది 12 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత ఏడాది అక్టోబర్ నుంచి ఎఫ్ఐఐలు తీవ్ర అమ్మకాల ఒత్తిడిలోనే ఉంటున్నారు. అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు.

30 నిమిషాల్లో మొబైల్ డెలివరీ

ఆన్‌లైన్లో బుకింగ్ చేసుకున్నవారికి అందిస్తున్న సంగీత మొబైల్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: మొబైల్, స్మార్ట్‌గాడ్జెట్ ఉత్పత్తుల విక్రయాల్లో అగ్రగామి సంస్థ సంగీత మొబైల్స్ తన పంథాను మార్చుకుంటున్నది. ఈ-కామర్స్ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి వినూత్న సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్‌ను బుకింగ్ చేసుకున్న 30 నిమిషాల్లోనే ఇంటికి డెలివరీ చేసే విధంగా ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతానికి ఈ వినూత్న సేవలు తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు సంగీత మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ మొబైల్ డెలివరీ సేవలను త్వరలో ముంబై, నోయిడాలో అందిస్తున్నట్లు, తర్వాతి క్రమంలో దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు చెప్పారు. మెట్రో నగరాలతో

పాటు చిన్న స్థాయి పట్టణాల్లో కూడా బుకింగ్ చేసుకున్నవారికి డెలివరి చేయనున్నట్లు తెలిపారు. స్టోర్లలో లభించనున్న అన్ని ఆఫర్లు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి కూడా వర్తించనున్నాయన్నారు. మరోవైపు, బెంగళూరులో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను సైతం త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ స్టోర్‌లో కృత్రిమ మేధస్సు టెక్నాలజీతో రూపొందించిన అన్ని రకాల ఎలక్ట్రానిక్ పరికరాలు లభించనున్నాయన్నారు.

హైదరాబాద్‌లో ష్నైడర్ మరో ప్లాంట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: ఎనర్జీ మేనేజ్‌మెంట్ అండ్ ఆటోమేషన్ దిగ్గజం ష్నైడర్ ఎలక్ట్రిక్..భారత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించబోతున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలో ప్రారంభమైన ఎలక్రామా 2025 సదస్సులో ష్నైడర్ ఎలక్ట్రిక్ సీఈవో ఒలివర్ బ్లూమ్ మాట్లాడుతూ..భారత్‌లో పెట్టుబడుల పరంపర కొనసాగుతున్నదని, భవిష్యత్తులో మరో మూడు ప్లాంట్లను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు దేశీయంగా 31 యూనిట్లు ఉండగా, కొత్తగా హైదరాబాద్‌తోపాటు కోల్‌కతా, అహ్మదాబాద్‌లలో కొత్తగా... దీన్నగర్‌లలో కొతత ప్లాంట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. వీటికి ఎంతమేర పెట్టుబడులు పెడుతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం భారత్..డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. వచ్చే 25 ఏండ్లలో వాతావరణ కాలుష్యాన్ని 75 శాతం తగ్గించడానికి టెక్నాలజీ పరంగా కీలక చర్యలు తీసుకుంటున్నట్లు, ముఖ్యంగా డిజిటల్ గ్రిడ్లను ఏర్పాటు చేయడం, ఐవోటీ ఆధారిత విద్యుత్ సరఫరాను చేయడం ద్వారా ఇది సాధ్యమవుతున్నదన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి కొత్తగా 12 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి రూ.3,200 కోట్ల మేర పెట్టుబడి పెట్టబోతున్నట్లు గతంలోనే ప్రకటించింది.

ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలు
సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఫిబ్రవరి 22 : ఈ నెల 27న నిర్వహించే ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎన్నికలకు 18, గ్రాడ్యుయేట్ ఎన్నికలకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు సమర్థంగా నిర్వహించడంలో శిక్షణ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర మోతీలాల్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రెబ్బెన, ఫిబ్రవరి 22: బెల్లంపల్లి ఏరియాకు సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు రక్షణ సూత్రాలు పాటిస్తూ సమష్టిగా అధిగమించాలని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) కే వెంకటేశ్వర్లు సూచించారు. బెల్లంపల్లి ఏరియాలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఖైరగూడ ఓసీపీ సందర్శించి బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతపై ఆరా తీశారు. ఉత్పత్తి ఉత్పాదకతలో కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి ఓసీపీ పని స్థలాలు పరిశీలించారు. ఖైరగూడ ఓసీపీ నుండి డోర్లి 1 వరకు వెళ్లే డైవర్షన్ రోడ్డు, వంతెన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరియా ఉన్నత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు సలహాలు, సూచనలు చేసారు. డైరెక్టర్‌ను ఏరియా అధికారులు మొక్క అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్, ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజినీర్ రామనాథం, ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, ఎస్టేట్ అధికారి నవనీత, ఫైనాన్స్ అధికారి రవికుమార్, మేనేజర్ శంకర్, సీహెచ్‌పీ ఇంచార్జి కోటయ్య, సివిల్ ఎస్ఈ మదీన బాషా, సీనీయర్ పీవో శ్రీనివాస్ లతో పాటు పలువురు ఉన్నారు.



గోలేటి జీఎం కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు

సీసీసీ నస్పూర్ : బేడెన్ పావెల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీజీఎం పర్సనల్ అరవిందరావు

రెబ్బెన : గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో బేడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్

ఘనంగా ప్రపంచ ఆలోచనా దినోత్సవం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 22: బేడెన్ పావెల్ జయంతి సందర్భంగా సీసీసీ టౌన్‌షిప్‌లోని సింగరేణి పాఠశాలలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం పర్సనల్ అరవిందరావు పాల్గొని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో కలిసి సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. లార్డ్ బేడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఇటీవల మందమర్రిలో నిర్వహించిన తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ప్రతిభ కనబర్చిన గైడ్స్ విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ముగ్గురు స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు యూనిఫామ్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బేడెన్ పావెల్‌ను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో సమాజ సేవల్లో పాల్గొంటూ భావి భారత పౌరులుగా ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ పట్టణంలో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, సీనియర్ ఉపాధ్యాయుడు రాధాకృష్ణమూర్తి, గైడ్స్ కెప్టెన్ హేమలత, స్కౌట్ మాస్టర్ శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ, దేశభక్తి

మందమర్రి, ఫిబ్రవరి 22: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ద్వారా విద్యార్థుల్లో మంచి క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని సింగరేణి మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ ఎస్.శ్యాంసుందర్ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బేడెన్ పవెల్ జయంతిని పురస్కరించుకుని సింగరేణి పాఠశాల ఆవరణలో శనివారం స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహించారు. బిడెన్ పావెల్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే.పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ కల్పలత, జే.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోలేటిటౌన్‌షిప్‌లో..

రెబ్బెన, ఫిబ్రవరి 22 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్‌లో గల సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం రోజున వరల్డ్ థింకింగ్ డే (ప్రపంచ ఆలోచన దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హజరైన బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ మచ్చగిరి నరేందర్ ముందుగా భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పతకం అవిష్కరించి, భారత స్కౌట్ అండ్ గైడ్స్ అధ్యుడు బెడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేశారు. బెడెన్ పావెల్ సేవలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జనరల్ మేనేజర్ రాజమల్లు, సీనియర్ పీవో శ్రీనివాస్, హెచ్ఎం రవితేజ, పీఈటీ భాస్కర్, ఉపాధ్యాయులు, సిబ్బంది కరిష్మా, నరేశ్, సుమన్, కవిత, వరలక్ష్మి, వనజ, శైలజ, సంధ్యారాణి లతో పాటు పలువురు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్



దర్బార్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 22 : పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో స్పెషల్ పార్టీ, క్యూఆర్‌టీ సిబ్బందితో దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు విధినిర్వహణలో భాగంగా ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని, క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన విధులు నిర్వహించడం వల్ల ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చునని తెలిపారు. కానీ వ్యక్తిగత కారణాలతో ఎదురయ్యే మానసిక ఒత్తిళ్ల వల్ల ప్రమాదకర సమస్యలు ఎదురవుతాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో కుటుంబం రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉంటుందని చెప్పుకొచ్చారు. వ్యసనాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, విధులను నిబద్ధత, బాధ్యతతో చేయాలని, పోలీస్ శాఖకు మంచి పేరుతీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్ నిర్మాణాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 22 : క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్ గార్డెన్స్ నుంచి కుర్మపల్లి స్టేజీ వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతుండగా, తిమ్మాపూర్-దుబ్బపల్లి గ్రామాలకు వెళ్లే దారుల వద్ద యూ-టూర్న్ ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డివైడర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. తిమ్మాపూర్,దుబ్బపల్లి గ్రామాలకు వెళ్లే దారుల వద్ద యూ-టర్న్ ఇవ్వకుండా డివైడర్ నిర్మించడం వల్ల తమకు దూరం పెరుగుతుందన్నారు. పద్మావతి కాలనీ వద్ద ఆర్టీసీ రెక్వెస్ట్ బస్టాప్ ఉన్నప్పటికీ అధికారులు డివైడర్ నిర్మించడం సరికాదన్నారు. ప్రజలకు అవసరమైన చోట్ల యూ-టర్న్‌లు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి దృష్టి తీసుకువెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం శంకర్, మేకల శ్రీనివాస్, కొమ్ము సతీశ్, అనుముల సురేష్, సందనగిరి శ్రీనివాస్, సల్లం నరేశ్, ఆకుదారి మల్లేశ్ ఉన్నారు.

డివైడర్ నిర్మించ వద్దంటూ ఆందోళన చేస్తున్న తిమ్మాపూర్ ప్రజలు

ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్ష

మందమర్రి, ఫిబ్రవరి 22: వచ్చే నెల 6న సింగరేణి మందమర్రి ఏరియాలోని శాంతిఖని గని విస్తరణపై పాత గని సమీపంలో నిర్వహించనున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఏరియా అధికారులకు ఏరియా జీఎం జీ.దేవేందర్ సూచించారు. ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం శాంతిఖని విస్తరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేయాలని హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని జీఎం అన్నారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, ఏరియా ఇంజినీర్ వెంకరమణ, శాంతిఖని ఏజెంట్ ఖాదిర్, డీజీఎం ఐఈడీ రాజన్న, ఎన్విరాన్‌మెంట్ అధికారి వెంకటరెడ్డి, ఫారెస్ట్ అధికారి స్వప్న, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

డైరెక్టర్ సూర్యనారాయణ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 22 : సింగరేణి సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్) ఎల్వీ సూర్యనారాయణ కోరారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో మైసమ్మ ఆలయం 22వ వార్షికోత్సవాల్లో డైరెక్టర్ సూర్యనారాయణ, జీఎం ఎం శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి చేశారు. వర్క్‌షాప్‌లో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీవైజీఎం అరవిందరావు, వర్క్‌షాప్ డీవైజీఎం రవీందర్, ఎస్వోటూజీఎం సత్యనారాయణ, ఈఈ రాకేశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, నాయకులు బ్రహ్మచారి, మహేశ్‌రావు, సదానందం, ఒల్లాల రవి, మోహన్ కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ వినతి

రెబ్బెన, ఫిబ్రవరి 22: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని బెల్లంపల్లి ఏరియా పర్యటనకు వచ్చిన సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) కె.వెంకటేశ్వర్లుకు శనివారం ఏఐటీయుసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. గోలేటి ఓసీపీ తొందరగా ప్రారంభించాలని, గోలేటి, మదారం టౌన్‌షిప్ కార్మిక కాలనీల్లో మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలని, మ్యాన్‌పవర్ కొరత ఉన్నందున ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్స్, ఈపీ ఎలక్ట్రీషియన్ సిబ్బందిని నియమించాలని, ఈపీ ఆపరేటర్లకు వేకెన్సీతో సంబంధం లేకుండా గ్రేడ్స్ ను కల్పించాలని విన్నవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు తదితరులున్నారు.

హెచ్చరిక బోర్డు మాయం

పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు

చెన్నూర్ టౌన్, ఫిబ్రవరి 22 : చెన్నూర్ పట్టణ శివారులోని సర్వే నంబర్ 863 స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు గురికాకుండా తహసీల్దార్ మల్లికార్జున్ అక్కడ గురువారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. సదరు బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని శుక్రవారం రాత్రి సమాచారం అందిందని తహసీల్దార్ పేర్కొన్నారు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. చెన్నూర్ పట్టణ పరిధిలోని సర్వే నంబర్ 863లో ప్రభుత్వ స్థలాన్ని గతంలో జర్నలిస్టులకు ప్రతిపాదించారు. ఆ స్థలాన్ని పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం కబ్జా చేయడానికి యత్నించారు. అక్రమంగా స్తంభాలు వేస్తుండడంతో పలువురు జర్నలిస్టులు అడ్డుకున్నారు. తమకు ఇండ్ల స్థలాలకు ప్రతిపాదించిన భూమిని కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన తహసీల్దార్ సిబ్బందితో కలిసి గురువారం అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించారు. కాగా, గుర్తు తెలియని వ్యక్తులు బోర్డు తొలగించడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.